సాక్షి
సిద్దిపేట
సోమవారం ౹ 6 ౹ జనవరి ౹ 2025

గంగిరెద్దు విన్యాసం



భోగిమంటల చుట్టూ మహిళల ఆటాపాట





రాజగోపురం ఎదుట భక్తుల సందడి, (ఇన్‌సెట్) పట్నాలు వేస్తున్న భక్తులు

మల్లన్న క్షేత్రం.. భక్తజన సంద్రం

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలన్నీ కిటకిటలాడాయి. వేకువజామునుంచే స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. గంగరేణి చెట్టు వద్ద ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కొండపైన ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పించారు. స్వామి వారి దర్శనానికి సుమారు 3 గంటల సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

\- కొమురవెల్లి(సిద్దిపేట)

ముందస్తు సంబురాలు

జిల్లా కేంద్రానికి ముందే సంక్రాంతి శోభ వచ్చేసింది. ముందస్తు సంబరాలు అంబరాన్నంటాయి. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సిద్దిపేట నియోజకవర్గం ఇన్‌చార్జి దూది శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లో సంక్రాంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించేలా గ్రౌండ్‌ను అలంకరించారు. రంగురంగుల ముగ్గులు వేశారు. ముగ్గులపై గొబ్బెమ్మలు పెట్టారు. భోగిమంటలు వేసి చుట్టూ నృత్యాలు చేసి మహిళలు సందడి చేశారు. అక్కడికి వచ్చిన ప్రజలంతా సామూహికంగా ముందస్తుగా సంక్రాంతిని ఆహ్వానించారు. విద్యార్థుల వేషధారణలు, గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మహిళలు పిండి వంటలు చేసి ప్రదర్శించారు. ముగ్గుల పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

\- ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)



సంక్రాంతి వంటకాలను ప్రదర్శిస్తున్న మహిళలు

న్యూస్‌రీల్

జాతీయస్థాయి జూడో పోటీలకు భరత్



సిద్దిపేట ఎడ్యుకేషన్: జాతీయ స్థాయి సీనియర్ జూడో పోటీలకు జిల్లాకు చెందిన చామంతుల భరత్ ఎంపికైనట్లు జూడో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోహెడ మండలం బస్వాపూర్‌కు చెందిన చామంతుల భరత్ జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపికవ్వడం హర్షించే విషయమన్నారు. రాష్ట్రం నుంచి జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేందుకు తొమ్మిది మంది క్రీడాకారులు ఎంపికవ్వగా అందులో భరత్ ఉండటం గర్వకారణమన్నారు. పీఈటీలు, పీడీలు భరత్‌ను అభినందించారు.

చేదబావులు కనుమరుగు!



మాచాపూర్‌లో చేదబావి

చిన్నకోడూరు(సిద్దిపేట): పల్లెల్లో చేదబావులు కనుమరుగు అవుతున్నాయి. గ్రామాల్లో పూర్వం ఇంటికో చేదబావి ఉండేది. అంతేకాకుండా వీధుల్లో బావుల ద్వారా ప్రజలు నీటిని తెచ్చుకునేవారు. కాలక్రమేణా చేదబావులు కనుమరుగయ్యాయి. ఇళ్లలోని బావులు పూడ్చి వేస్తున్నారు. వీధుల్లో ఉన్న చేదబావులు నీరు లేక ఎండిపోవడంతో పరిసర ప్రాంతాల వారు చెత్తా చెదారం పోసేందుకు వాడుతున్నారు. కాలక్రమేణా బోర్లు రావడంతో ఇళ్లల్లో బోర్లు వేసుకుని మోటారు ఏర్పాటు చేసి నీటిని పొందుతున్నారు. దీంతో చేదబావులు కనుమరుగు అయ్యాయి. ప్రస్తుత తరానికి చేదబావుల గురించి కథలుగా చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది అనడంలో ఆశ్చర్యం లేదు.

నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ సేవలు అభినందనీయం



పూడికతీత పనులను ప్రారంభిస్తున్న మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్ రూరల్: రైతులను ప్రోత్సహిస్తున్న నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ సేవలు అభినందనీయమని మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని రెడ్డిపల్లిలో నేషనల్ ఆగ్రో ఫౌండేషన్, వారిటీస్ సంస్థల ఆధ్వర్యంలో చెరువులో పూడికతీత, సేంద్రియ ఎరువులతో వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సాపూర్ మండలంలో 15 గ్రామ పంచాయతీలో ఆగ్రో ఫౌండేషన్ సంస్థ సేవలు అందించేందుకు ముందుకు రావడం శుభపరిణామం అన్నారు. భూసార పరీక్షలు, సేంద్రియ వ్యవసాయం, చెరువులు, కుంటలలో పూడికతీత, నీటి నిల్వలు వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

‘శిశు సంరక్షణ’పై నిర్లక్ష్యం!

- తరలింపుపై ఏడాదికి పైగా ఎదురుచూపులు
- కార్పొరేట్ స్థాయి వసతులున్నా.. వినియోగించుకోని వైనం
- గజ్వేల్‌తోపాటు మరో అయిదు జిల్లాలకు ఆధారం
- ఓపీ సేవలకే పరిమితమైన దుస్థితి

గజ్వేల్‌లో వంద పడకలతో కార్పొరేట్ తరహా వసతులతో నిర్మించిన మాతా శిశు సంరక్షణ ఆస్పత్రిని సొంత భవనంలోకి తరలించడంపై అనిశ్చితి నెలకొన్నది. గజ్వేల్‌తోపాటు సమీప జిల్లాలు మెదక్, యాదాద్రి, జనగామ, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలకు సైతం ఈ ఆస్పత్రి వల్ల ప్రయోజనం చేకూరుతుండగా, చిన్న, చిన్న కారణాలను సాకుగా చూపుతూ తరలింపులో వైద్యారోగ్య శాఖ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా గర్భిణులు, బాలింతలకు ఇబ్బందులు తప్పడం లేదు.

సొంత భవనంలోకి ఎంసీహెచ్ కలేనా?



గజ్వేల్‌లో నూతనంగా నిర్మించిన మాతా శిశు సంరక్షణ ఆస్పత్రి

గజ్వేల్: అప్పటి సీఎం కేసీఆర్ చొరవ ఫలితంగా రూ.27.35కోట్ల వ్యయంతో మాతా శిశు సంరక్షణ ఆస్పత్రి (మెటర్నిటీ అండ్ చైల్డ్ హెల్త్ హాస్పిటల్)ని నిర్మించారు. ఆస్పత్రి భవనాన్ని జీ ప్లస్ టూ (మూడు అంతస్తులు)గా 79,800 చదరపు అడుగుల విస్తీర్ణంలో వివిధ విభాగాలుగా నిర్మించారు. చిన్నపిల్లల ఐసీయూ, ప్రత్యేక వార్డులు, ఎస్‌ఎంసీయూ, మూడు ఆపరేషన్ థియేటర్లు, నాలుగు లేబర్ రూమ్‌లు, ఓపీ, ఫ్యామిలీ ప్లానింగ్, బ్రెస్ట్ ఫీడింగ్‌కు ప్రత్యేకమైన విభాగాలను ఏర్పాటు చేశారు. ఈ ఆస్పత్రిని 2023 అక్టోబర్ 4న అధికారికంగా ప్రారంభోత్సవం కూడా చేశారు. కానీ ఇందులోకి ఇంకా మాతా శిశు సంరక్షణ ఆస్పత్రిని మార్చలేదు. కేవలం ఓపీ సేవలను మాత్రమే ఇందులో అందిస్తున్నారు.

ఆరు జిల్లాలకు ఆధారం

మెదక్, యాదాద్రి, మేడ్చల్, జనగామ, సంగారెడ్డి జిల్లాల్లోని సరిహద్దు గ్రామాలతో పాటు సిద్దిపేట జిల్లా నుంచి కూడా భారీ సంఖ్యలో గర్భిణులు ప్రసవాల కోసం ఇక్కడి మాతా శిశు సంరక్షణ ఆస్పత్రికి వస్తుంటారు. నెలకు సుమారు 350–400 డెలివరీలు చేస్తున్నారు. కానీ ఇక్కడి వచ్చే రద్దీకి, ఉన్న సౌకర్యాలకు పొంతన లేకుండా పోతున్నది. కొత్త భవనంలోకి షిఫ్ట్ అయి వసతులు క్రమంగా పెంచితేనే గర్భిణులు, బాలింతలకు సాంత్వన చేకూరడంతోపాటు చిన్నపిల్లల వైద్యానికి ఇక్కట్లు తొలగనున్నాయి.

అనుమతి రాగానే..

గజ్వేల్ ఎంసీహెచ్‌ను కొత్త భవనంలో షిఫ్ట్ చేయడానికి ప్రయత్నిస్తున్నాం. ఉన్నతాధికారుల అనుమతి కోసం వేచిచూస్తున్నాం. ఆపరేషన్ థియేటర్లకు సంబంధించిన పరికరాల సమస్య కూడా వారి దృష్టికి తీసుకెళ్లాం. అనుమతి రాగానే అందుబాటులో ఉన్న సిబ్బందితో సొంత భవనంలోకి వెళ్తాం.

\- డాక్టర్ అన్నపూర్ణ, జిల్లా ప్రభుత్వాస్పత్రుల ఇన్‌చార్జి కో ఆర్డినేటర్

అధికారుల నిర్లక్ష్యమే కారణం..

ఎంసీహెచ్‌కు కేవలం ఏడుగురు గైనకాలజిస్టులు, 30మంది వివిధ విభాగాల సిబ్బంది మాత్రమే ఉండటం.. ఆపరేషన్ థియేటర్లకు సంబంధించి సెంట్రల్ స్టెరిలైజేషన్ పరికరాలు అందుబాటులో లేవనే కారణంతో సొంత భవనంలోకి తరలించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆపరేషన్ థియేటర్లకు సంబంధించిన పరికరాల సమకూర్చుకోవడం పెద్ద పని కానప్పటికీ సంబంధిత అధికారులు ఏడాదికిపైగా నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలున్నాయి. కొత్త భవనంలోకి షిఫ్ట్ అయిన తర్వాత కూడా సిబ్బంది సంఖ్యను పెంచుకోవడానికి ప్రయత్నించే అవకాశమున్నా.. ఆ దిశగా చొరవ చూపడం లేదు. దీనివల్ల ఎంసీహెచ్ ఇప్పటికీ ఎదురుగా ఉన్న జిల్లా ఆస్పత్రిలోనే కొనసాగుతున్నది. ఫలితంగా రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. నిజానికి వంద పడకల ఎంసీహెచ్‌లో 20మందికిపైగా గైనకాలజిస్టులు, 10మంది వరకు అనెస్థీషియా(మత్తు మందు డాక్టర్లు)తోపాటు వివిధ విభాగాల సిబ్బందిని మరో వందమందికిపైగా సాధారణ సిబ్బందిని నియమించాల్సి ఉంది. పూర్తిస్థాయి సిబ్బంది వచ్చే వరకు కొత్త భవనంలోకి షిఫ్ట్ కావడంలేదనే వాదనను సంబంధిత అధికారులు తెరమీదకు తేవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకపోతే ఎంసీహెచ్ ఆవరణలో 13,578 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించాలనుకున్నా వైద్యుల క్వార్టర్లు, 7,670 చదరపు అడుగుల విస్తీర్ణంలో నర్సింగ్ క్వార్టర్ల పనులు ఇంకా పూర్తి కాలేదు.



ఆస్పత్రిలో ఓపీ సేవలు ఇలా

మరో 10 వేల మందికి ‘రక్షణ’

- రూ.17 కోట్లతో బతుకమ్మ ఘాట్, చెరువుల అభివృద్ధి
- మంత్రి పొన్నం ప్రభాకర్
- ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులకు శంకుస్థాపన

హుస్నాబాద్: రెండో విడత మరో 10 వేల మంది గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలు పంపిణీ చేయనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పట్టణంలో ఆదివారం రూ.26.60 కోట్ల వ్యయంతో ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులకు, కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణాలకు, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మొదటి విడతగా 15 వేల మంది గీత కార్మికులకు రక్షణ కవచాలు పంపిణీ చేశామన్నారు. ఈ నెల 25లోగా రెండో విడతగా కాటమయ్య రక్షణ కవచాలను పంపిణీ చేస్తామన్నారు. హుస్నాబాద్ ప్రాంతానికి తలమానికమైన ఎల్లమ్మ చెరువును అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే మరో రూ.17 కోట్ల వ్యయంతో ఆరపల్లె చెరువు బతుకమ్మ ఘాట్, పల్లె చెరువు, కొత్త చెరువు సుందరీకరణ పనులు చేపడతామన్నారు. ఎల్లమ్మ చెరువు నుంచి పందిల్ల వరకు రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు.



డోలు కొడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

రైతు సంక్షేమానికే రైతు భరోసా

రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, రైతు భరోసా కింద ఎకరాకు రూ.12వేలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లుగా రేషన్ కార్డులు ఇవ్వలేదని, ఈ నెల 26 నుంచి నూతన రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆర్డీఓ రామ్మూర్తి, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాటామంతి..

హుస్నాబాద్‌లోని ప్రభుత్వ మైనార్టీ బాలికల రెసిడెన్సియల్ పాఠశాలను ఆదివారం మంత్రి పొన్నం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు మంత్రి మాటామంతి జరిపారు. గతంలో సాధించిన విజయాలను వారితో పంచుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు. కాస్మోటిక్ కిట్లు, షూస్, యూనిఫామ్‌లు రాలేదని విద్యార్థినులు మంత్రి దృష్టికి తెచ్చారు. అలాగే ఇంటర్మీడియెట్ వరకు ఉన్న మైనార్టీ రెసిడెన్సియల్ పాఠశాలను డిగ్రీ వరకు అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. వెంటనే సమస్యలపై మైనార్టీ సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ తాఫ్సిర్ ఇక్బాల్, సీఎం సెక్రటరీ షానవాజ్ కాసింతో మంత్రి మాట్లాడారు. డిగ్రీ వరకు అప్‌గ్రేడ్ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.



విద్యార్థినులతో ముచ్చటిస్తున్న మంత్రి

స్పైడర్ అల్లిక... బహు పొందిక

సాలె పురుగు (స్పైడర్)ల దేహాలు చిన్నవే అయినా రంగు రంగుల సీతాకోకలను తలపిస్తున్నాయి. సూది మొనంత మెదడున్న సాలె పురుగుల అల్లికలు అబ్బుర పరుస్తున్నాయి. సాలె పురుగులు అల్లుతున్న సిల్క్ దారాలు ఉదయం కురుస్తున్న పొగ మంచుతో ముత్యాల్లా మెరిసి పోతున్నాయి. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో సాలె పురుగులు అల్లుతున్న గూళ్లను ‘సాక్షి’ కెమెరా ఇలా క్లిక్‌మనిపించింది.

\- మిరుదొడ్డి(దుబ్బాక)



అల్లికలతో ఆకట్టుకుంటున్న సాలె పురుగు

‘లక్ష డప్పుల’తో సత్తా చాటుతాం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ
- గజ్వేల్‌లో మాదిగల ఆత్మీయ సమ్మేళనం

గజ్వేల్: ‘లక్ష డప్పులు– వెయ్యి గొంతుకలు’ కార్యక్రమంతో సత్తా చాటుతామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం గజ్వేల్‌లో నిర్వహించిన మాదిగ– ఉపకులాల ఆత్మీయ సమ్మేళనానికి ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం, ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న, జాతీయ మాదిగ కళామండలి అధ్యక్షుడు అశోక్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ సుప్రీం కోర్టులో వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకపోవడం కుట్రలో భాగమేనన్నారు. రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా వర్గీకరణకు అనుకూలంగా ఉన్నా.. కుట్రలతో కొందరు అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఫిబ్రవరి 3న నగరంలో నిర్వహించనున్న ‘లక్ష డప్పులు– వెయ్యి గొంతుకలు’ కార్యక్రమంతో కుట్రలన్నీ ఛేదిస్తామని హెచ్చరించారు. ఉద్యమిస్తున్న మందకృష్ణకు మనమంతా అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. వర్గీకరణ ప్రజాస్వామిక ఆకాంక్ష కార్యరూపంలోకి వచ్చేంత వరకు విశ్రమించవద్దన్నారు. ప్రజాగాయకుడు, బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న, జాతీయ మాదిగ కళామండలి అధ్యక్షులు ఆశోక్‌ల ఆట, పాట విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాదిగ జేఏసీ నాయకులు బొల్లారం ఎల్లయ్య, మల్లేశం, చేబర్తి యాదగిరి, నాగభూషణం, పొట్ట యాదగిరి, కుమార్, రాములు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా అంతకుముందు పట్టణంలో డప్పుచప్పుళ్లు, నృత్యాలతో ర్యాలీ నిర్వహించారు.



ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న మందకృష్ణ

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

సిద్దిపేటఅర్బన్: పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, త్రీటౌన్ పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం రాజీవ్ రహదారి పక్కన గల ఓ వే బ్రిడ్జ్ వద్ద కొంత మంది కలిసి పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడి చేయగా ఐదుగురు పట్టుబడ్డారు. వారి నుంచి రూ. 2,730, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

పోరాటంతోనే సమస్యలు పరిష్కారం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు
- పటాన్‌చెరులో 2కే రన్

పటాన్‌చెరుటౌన్: కార్మిక,కర్షక,ప్రజాసమస్యలు పరిష్కారం అవ్వాలంటే ఉద్యమాలు, పోరాటాలతోనే సాధ్యమని సీపీఎం రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం చైర్మన్, సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం పటాన్‌చెరు పట్టణంలో మహాసభల వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున్‌తో కలిసి 2కే రన్‌లో ఆయన పాల్గొన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి రామచంద్రపురంలోని అంబేడ్కర్ విగ్రహం వరకు జరిగిన 2 కే రన్‌ను చుక్కా రాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కార్మిక వర్గ సమస్యలు పోరాటాలతోనే పరిష్కారం అవుతాయే తప్ప పాలకుల దయాదాక్షిణ్యాలపై కాదని ఇప్పటికే అనుభవంలో రుజువైందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వర్గం పైనే దాడి చేస్తోందని 49 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చిందని ఆరోపించారు. ఈ నెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలో కార్మిక కర్షక ప్రజా సమస్యలపై చర్చించి కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు.



2కే రన్‌ను ప్రారంభిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు

భవిష్యత్తు అంతా యువతదే..

- కాంగ్రెస్ అన్యాయాలపై ప్రజా చైతన్యం
- పనులు జరిగే వరకు పోరాటం
- ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపు

సిద్దిపేటజోన్: భవిష్యత్తు అంతా యువతదేనని, యువత రాజకీయాల్లో ముందు వరుసలో ఉండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నంగనూర్ మండల యువజన విభాగం నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యువతకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ అన్యాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజా చైతన్యం తీసుకురావాలన్నారు. కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలో ఎగవేతలు, కోతలు తప్ప పాలనపై పట్టు లేదని విమర్శించారు. ఆరు గ్యారంటీలను అటకెక్కించారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో సిద్దిపేట ఎడారిగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట ప్రజలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడి మంజూరు అయిన నిధులను రద్దు చేయడం, జరుగుతున్న పనులను ఆపడం లాంటివి చేస్తోందని విమర్శించారు. ప్రగతికి సంబంధించిన నిధులు సాధించే వరకు పోరాటం చేస్తానని అన్నారు. రద్దు చేసిన పనులు తిరిగి ప్రారంభం అయ్యే వరకు కాంగ్రెస్ ను వదిలేది లేదన్నారు. ఇదే విషయాన్ని యువత ప్రజలకు వివరించి ఏడాదిలో జరిగిన అన్యాయాన్ని అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో సీనియర్ నాయకుడు భుపేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరీశ్‌రావు

క్రీడాకారిణికి అభినందనలు

చిన్నకోడూరు(సిద్దిపేట): షాట్‌పుట్ క్రీడా పోటీల్లో మెట్‌పల్లి గ్రామానికి చెందిన క్రీడాకారిణి సింగిరెడ్డి సిరిచందన ప్రతిభ చూపింది. రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదివారం క్రీడాకారిణిని సన్మానించి అభినందించారు. తన సంపూర్ణ సహకారం ఉంటుందని, భవిష్యత్‌లో ఇంకా ఉన్నత స్థాయిలో ఎదగాలని హరీశ్ ఆకాంక్షించారు. సిరిచందన తల్లిదండ్రులు, నాయకులు ఉన్నారు.



క్లుప్తంగా

ఏడుపాయల్లో పుస్తెల తాడు చోరీ

పాపన్నపేట(మెదక్): మహిళ నిద్రిస్తుండగా బంగారు పుస్తెలతాడు చోరీ చేశారు. ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం మేరకు... కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన దేశాయిపేట స్రవంతి తన భర్త, ఇతర బంధువులతో కలిసి శనివారం ఏడుపాయల ఆలయానికి వచ్చారు. రాత్రి హరిత హోటల్ సమీపంలో ఉన్న సత్రంలో నిద్రిస్తుండగా గుర్తుతెలియని దుండగులు ఆమె ఒంటిపై ఉన్న రెండు తులాల పుస్తెలతాడు అపహరించుకుపోయారు. కొద్ది సేపటి తరువాత మేల్కొన్న ఆమె పుస్తెలతాడు లేదని గుర్తించింది. వెంటనే కుటుంబసభ్యులను కూడా నిద్ర లేపగా వారు సైతం చుట్టుపక్కలంతా వెతికినా కనిపించకపోవడంతో వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

896 గ్రాముల గంజాయి పట్టివేత



నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

పటాన్‌చెరు టౌన్: ఓ ఇంట్లో అబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి 896 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో నివాసం ఉంటున్న ఒడిశాకు చెందిన దీపక్ కుమార్ ఇంటిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఇందులో అతని నుంచి 896 గ్రాముల గంజాయి, మొబైల్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఒడిశా నుంచి తెచ్చుకొని తాను వాడుతూ, మరికొంత మందికి విక్రయిస్తున్నాడని అధికారులు తెలిపారు. అతడిని పటాన్‌చెరు ఎక్సైజ్ అధికారులకు అప్పజెప్పగా రిమాండ్‌కు తరలించారు.

పేకాట స్థావరంపై దాడి



పోలీసుల అదుపులో పేకాటరాయుళ్ల

సిద్దిపేటరూరల్: మండలంలో ఉన్న చింతమడక.. కాశిరెడ్డి వెంకట్‌రెడ్డి ఫౌల్ట్రీఫాం షెడ్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రాగానే టాస్క్‌ఫోర్స్ అధికారులు పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ మేరకు ఆరుగురు పేకాటరాయుళ్లు కుశ శ్రీనివాస్, పోచంపల్లి యాదగిరి, కాశిరెడ్డి వెంకట్‌రెడ్డి, చైపాల దాసు, ఎర్రోళ్ల కనకయ్య, మహమ్మద్ బాబుమియాలను అదుపులో తీసుకున్నారు. వారి నుంచి రూ.10వేలు, ఆరు ఫోన్లు, ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం టాస్క్‌ఫోర్స్, రూరల్ పోలీసులు మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడైనా పేకాట, జూదం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. 87126-67445 87126-67446, 87126-67447 నంబర్లో సమాచారం అందించాలని సూచించారు.

బురదలో పడి రైతు మృతి



చంద్రం (ఫైల్)

రామాయంపేట(మెదక్): వ్యవసాయ పనులు చేసుకుంటున్న క్రమంలో ఒక రైతు మడిలో ఉన్న బురదలో పడి మృతిచెందిన సంఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం రాయిలాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు .. గ్రామానికి చెందిన రైతు గజం చంద్రం తన వ్యవసాయ భూమిలో శనివారం సాయంత్రం ఒడ్డు చెక్కుతుండగా ప్రమాదవశాత్తు బురదలో పడి మృతిచెందాడు. సమీపంలో ఉన్నవారు వచ్చి అతడిని బయటకు తీసేలోగా అప్పటికే మరణించాడు. చంద్రంకు భార్య కవిత, కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ విషయమై బాధిత కుటుంబం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదు. ఆదివారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

సేవలు అందేదెన్నడో?

నిరుపయోగంగా దుద్దెడ రైల్వేస్టేషన్

- ఏర్పాటు కాని టికెట్ కౌంటర్
- స్టేషన్ మార్గం ముళ్లకంపల మయం
- అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డా?

కొన్నినెలల క్రితం ప్రధాని మోదీ వర్చువల్‌గా దుద్దెడ రైల్వేస్టేషన్‌ను ప్రారంభించారు. కానీ ప్రయాణికుల సౌకర్యార్థం నేటి వరకు కూడా టికెట్ కౌంటర్ అందుబాటులోకి రాలేదు. దీంతో వారు సేవలను పొందలేకపోతున్నారు. జనసంచారం లేక స్టేషన్ బోసిపోగా ఇదే అదునుగా గుర్తుతెలియని వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకుంటున్నారు. మరోవైపు స్టేషన్‌కు వచ్చే రహదారి ముళ్ల కంపలతో నిండి ఉన్న దుస్థితి ఇక్కడ కనిపిస్తోంది.





దుద్దెడ రైల్వే స్టేషన్, ముళ్లకంపలతో మూసుకుపోయిన మట్టి రోడ్డు

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలం దుద్దెడ శివారులో రైల్వేస్టేషన్‌ను 15 నెలల కిందట ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రస్తుతం స్టేషన్ నిరుపయోగంగా మారింది. సిద్దిపేట నుంచి దుద్దెడ దుద్దెడ, కొత్తపల్లి, మనోహరాబాద్‌ల మీదుగా సికింద్రాబాద్ వరకు సుమారు 116 కిలో మీటర్ల వరకు రైలు సౌకర్యం కల్పించారు. ప్రయాణ సమయం సుమారు 4 గంటలు. టికెట్ ధర రూ.30లు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో రైళ్ల రాకపోకలు ఉంటాయి. తక్కువ ఖర్చుతో సిద్దిపేట నుంచి సికింద్రాబాద్ వరకు ప్రయాణించవచ్చు. అయితే రైల్వే స్టేషన్‌లో టికెట్ ఇచ్చే అధికారులు ఎవరూ లేరు. కాగా రైలు ప్రయాణ సౌకర్యం ప్రజలకు అందని ద్రాక్షలా మారింది. దుద్దెడ నుంచి 2 కిలో మీటర్ల దూరంలో స్టేషన్ ఉండగా ఇక్కడికి చేరుకోవడానికి రోడ్డు మార్గం లేదు. బందారం దర్గా బీటీ రోడ్డు మార్గం దూరమవుతుందని పలువురు చెబుతున్నారు. రైల్వే స్టేషన్ ఏర్పడితే తక్కువ ఖర్చులతో ప్రయాణ సౌకర్యం కలుగుతుందని మార్కెట్ విలువ కంటే తక్కువ ధరకు రైల్వే లైన్ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వానికి వందలాది ఎకరాల భూములను రిజిస్ట్రేషన్ చేశామని, ఇక్కడే వివిధ రకాల దుకాణాలు, వ్యాపారాలను ఏర్పాటు చేసుకుంటూ జీవించవచ్చని రైతులు ఆశించామన్నారు. తీరా చూస్తే ఇంకా పూర్తి స్థాయిలో సేవలు అందుబాటులోకి రాలేదని వాపోయారు. ఇక రైల్వే స్టేషన్ వరకు ముళ్ల పొదలతో మట్టి రోడ్డు నిండి ఉండగా ప్రయాణానికి చేసేందుకు అనుకూలంగా మార్చాలని, రైల్వే స్టేషన్‌లో టికెట్ కౌంటర్‌ను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు. జన సంచారం లేకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా కూడా మారిందంటూ ప్రచారం సాగుతోంది. గుర్తుతెలియని దుండగులు స్టేషన్ కిటికీలు పగులగొట్టారు.

15 నెలలవుతోంది..



దుద్దెడ నుంచి హైదారాబాద్‌కు రైల్లో వెళ్లవచ్చని ఎంతో ఆశపడ్డాం. పనులు జరుగుతున్నప్పుడు ఎంతో సంతోషించాం. ప్రారంభించి 15 నెలలు గడుస్తున్నాయి. పూర్తి స్థాయిలో సౌకర్యం అందుబాటులోకి రాలేదు. దుద్దెడ నుంచి స్టేషన్ వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలి. -గోనె శ్రీనివాస్ (బీఆర్ఎస్ నాయకుడు, దుద్దెడ)

టికెట్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలి



దుద్దెడ రైల్వే స్టేషన్‌కు రోడ్డు సౌకర్యం లేదు. సర్వీసు ఆటోలు కూడా అందుబాటులో ఉండవు. ఇబ్బందులు పడుతూనే ఇంటికి వెళ్తుంటారు. టికెట్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలి.

– యశ్వంత్ (విద్యార్థి, దుద్దెడ)

చైనా మాంజా అమ్మితే జైలుకే

సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్



సిద్దిపేటకమాన్: దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ ఉపేందర్

సిద్దిపేటకమాన్: ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ ఉపేందర్ హెచ్చరించారు. జిల్లా కేంద్రం సిద్దిపేట పట్టణంలోని కైట్స్ (పతంగులు) విక్రయిస్తున్న పలు దుకాణాలు, బుక్ డిపోల్లో సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. చైనా మాంజాను కలిగి ఉన్నా, విక్రయించే వారిపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నైలాన్, సింథటిక్ దారాలతో తయారు చేసే చైనా మాంజాలతో మనుషులతో పాటు పశు పక్షాదులకు ప్రమాదకరమని తెలిపారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారికి ఈ దారాలు అడ్డు తగిలి చాలామంది ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలు జరిగాయన్నారు. ఈ మంజా విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా విక్రయించినట్లు సమాచారం ఉంటే డయల్ 100కు ఫోన్ చేసి తెలపాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

చేర్యాలలో...

చేర్యాల(సిద్దిపేట): పతంగులను ఎగుర వేసేందుకు ఎవరైనా చైనా మాంజా వాడినా అమ్మినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నీరేశ్ హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని పతంగుల దుకాణాల్లో ఎస్ఐ తనిఖీలు నిర్వహించారు. సీపీ ఆదేశాల మేరకు పతంగుల దుకాణాల్లో తనిఖీలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను ఎవరైనా కలిగి ఉన్నా, ఇతరులకు అమ్మినా వారిపై చట్ట ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామన్నారు. పర్యావరణానికి విపత్తుగా మారడంతో జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ఈ మాంజా విక్రయ, వినియోగంపై ప్రత్యేక దృష్టి పడిందన్నారు. ఎవరైనా మాంజా సమాచారం తెలిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

జగదేవ్‌పూర్(గజ్వేల్): గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రమోహన్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. మండలకేంద్రానికి చెందిన తాటిపాముల కనకయ్య (60) శనివారం రాత్రి నడుచుకుంటూ కేశిరెడ్డి ఫంక్షన్‌హాల్ వైపు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొంది. దీంతో అతడి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గేదెను ఢీకొన్న బైక్.. వ్యక్తికి తీవ్రగాయాలు



తీవ్రగాయాలతో భిక్షపతి

చిన్నశంకరంపేట(మెదక్): బైక్ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన చిన్నశంకరంపేట మండలంలో ఆదివారం జరిగింది. ఎస్సీ హాస్టల్ వాచ్‌మన్ భిక్షపతి మెదక్ నుంచి చిన్నశంకరంపేటకు బైక్‌పై వస్తున్నాడు. కొర్విపల్లి వద్ద గేదె అడ్డు రాగా ఢీకొట్టాడు. దీంతో కింద పడి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చికిత్సపొందుతూ ఇద్దరి మృతి



రవి (ఫైల్)

నర్సాపూర్ రూరల్: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్సపొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. నర్సాపూర్ ఎస్సై లింగం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నర్సాపూర్‌కు చెందిన ఎద్దు రవి (36) కడుపునొప్పి భరించలేక ఈనెల 3న మల్పర్తి చెరువు వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు చెప్పగా స్పందించారు. వెంటనే అతను ఉన్న స్థలానికి చేరుకొని నర్సాపూర్ ఆస్పత్రికి తరలించారు. స్థానిక వైద్యుడు ప్రాథమిక చికిత్స అందజేసి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. దీంతో సికింద్రాబాద్‌లోని ఒక ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా ఈనెల 4వ తేదీ రాత్రి మృతిచెందాడు. రవి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దంపతులకు కూతురు వేదశ్రీ, ఇద్దరు కుమారులు ఉన్నారు. రవి గత కొన్ని నెలలుగా కడుపునొప్పితో తరచూ బాధపడేవాడని కుటుంబసభ్యులు తెలిపారు.

మత్రిముచ్చాలలో వృద్ధుడు..



సాయిలు (ఫైల్)

కొమురవెల్లి(సిద్దిపేట): మోకాళ్ల నొప్పులు భరించలేక క్రిమిసంహారక మందు తాగి చికిత్సపొందుతూ వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని మత్రిముచ్చాలలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఎంటె సాయిలు(65)మోకాళ్ల నొప్పులు భరించలేక గత నెల 28న క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మరణించినట్లు తెలిపారు. సాయిలు కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

- ప్రేమికుడి మృతి
- సిద్దిపేట జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి



సాగర్(ఫైల్)

సిద్దిపేటరూరల్: ప్రేమ వివాహానికి పెద్దలు ఒప్పుకోరని ప్రేమికులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ప్రేమికుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆదివారం సిద్దిపేట జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసింది. రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామానికి చెందిన రామంచ సాగర్(22) సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మూడు నెలల క్రితం ఒక సామాజిక మాధ్యమంలో హైదరాబాద్‌కు చెందిన యువతితో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ ప్రేమించుకున్నారు. ప్రేమను కుటుంబ సభ్యులు అంగీకరించరనే ఉద్దేశంతో గత నెల 22న రూరల్ మండలం పెద్ద లింగారెడ్డిపల్లి శివారులో ప్రేమికులు పురుగుల మందు తాగారు. అనంతరం సాగర్ ఈ విషయాన్ని ఫోన్‌లో కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. ఇక్కడి నుంచి ఇద్దరు ద్విచక్ర వాహనంపై సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. కుటుంబసభ్యులకు కూడా అక్కడికి చేరుకున్నారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం సాగర్ మృతిచెందాడు. ప్రియురాలి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. సాగర్ సోదరుడు మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్‌రంగం ప్రైవేటీకరణకు యత్నం



మాట్లాడుతున్న సుదీప్ దత్

ఈఈఐఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుదీప్ దత్

సిద్దిపేటజోన్: ప్రభుత్వ విధానాలతో విద్యుత్ సంస్థలు నష్టాల్లోకి పోతున్నాయని, వాటిని సాకుగా చూపి ఈ రంగాన్ని ప్రైవేటు పరం చేసేందుకు మోదీ సర్కారు ప్రయత్నాలు చేస్తోందని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఇండియా ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుదీప్‌దత్ ఆరోపించారు. ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాల్గవ మహాసభల ముగింపు సందర్భంగా ఆదివారం విపంచి ఆడిటోరియంలో జరిగిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. తెలంగాణలో విద్యుత్ సంస్థలను ప్రైవేటు పరం చేసే పనిలో ప్రభుత్వం ఉందన్నారు. దీన్ని అడ్డుకునేందుకు సమష్టిగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రెండేళ్లలో పూర్తి చేయాల్సిన యాదాద్రి విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను ఏడేళ్ల పాటు నిర్మించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారి వ్యవస్థకు అనుకూలంగా పనిచేస్తున్నాయని ఆరోపించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి గోవర్దన్ మాట్లాడుతూ విద్యుత్ రంగంలో నియామకాలు జరగక ఉన్న ఉద్యోగులపై పనిభారం పడుతోందన్నారు. ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు గోపాల్ స్వామి, చంద్రారెడ్డి, మధు, అశోక్, గిరి, భూపతి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



శ్రీకాంత్

పటాన్‌చెరు టౌన్: కుమారుడి అదృశ్యం పై తండ్రి ఫిర్యాదు చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కోటేశ్వర రావు తెలిపిన వివరాల ప్రకారం... పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన మేదరి కృష్ణ కుమారుడు మేదరి శ్రీకాంత్ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గతనెల 13న మధ్యాహ్నం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బైక్ తీసుకొని వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. అదృశ్యమైన అతని కోసం తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. గతంలో ఇదే మాదిరిగా శ్రీకాంత్ 15 రోజుల పాటు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చాడని తండ్రి పోలీసులకు తెలిపారు. తండ్రి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి పేరుతో యువకుడి మోసం

సిద్దిపేటరూరల్: పెళ్లి చేసుకుంటానని యువతిని మోసం చేసిన ఘటనలో యువకుడిపై కేసు నమోదైంది. ఈ ఘటన రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ వివరాల ప్రకారం ... మండలంలోని ఒక గ్రామానికి చెందిన యువతి, చిన్నకోడూరు మండలం మాల్లారం గ్రామస్తుడు నిఖిల్‌రెడ్డిలు 2019లో ఇంటర్ చదివే సమయంలో పరిచయం ఏర్పడింది. ఇది కాస్తా ప్రేమగా మారింది. దీంతో పలుమార్లు ఇంట్లో చెప్పకుండా టూర్లకు వెళ్లి వస్తున్నారు. యువతీ రెండుసార్లు గర్భవతి కాగా విషయం తెలుసుకొని అబార్షన్ చేయించాడు. తనను పెళ్లి చేసుకోవాలని యువతి కోరగా ఆర్థికంగా స్థిరపడ్డాక చేసుకుందామని బుకాయిస్తూ వచ్చాడు. అంతటితో ఆగకుండా యువతి నగ్నచిత్రాలను మిత్రులకు పంపిస్తానని చెప్పి బెదిరిస్తూ పలుమార్లు యువతిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇదిలా ఉండగా ప్రియురాలికి ఫోన్ చేసి డబ్బులు, కట్నం ఎక్కువగా ఇచ్చే మరో యువతితో నిశ్చితార్థం అయిందని నిఖిల్‌రెడ్డి చెప్పాడు. దీంతో తనను మోసం చేశాడంటూ పోలీసులను ఆశ్రయించింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

మూతబడిన పరిశ్రమలో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

జిన్నారం (పటాన్‌చెరు): ఒక మూతబడిన పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఐడీఏ బొల్లారం పారిశ్రామిక వాడలోని పీపీఎల్ పరిశ్రమ గత ఏడాదే మూతబడింది. బుధవారం మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు పోలీసులకు ఫైరింజన్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు ఇక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. జరిగిన నష్టాన్ని అంచనా వేయాల్సి ఉంది. ప్రమాద ఘటనకు సంబంధించిన కారణాలపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాసంఘాల బలోపేతానికి ప్రాధాన్యం

సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

సిద్దిపేటఅర్బన్: భారత కమ్యూనిస్టు పార్టీకి ప్రజాసంఘాలే ప్రధాన పట్టుకొమ్మలని, ప్రజాసంఘాల బలోపేతమే లక్ష్యంగా పార్టీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పనిచేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల సంయుక్త సమావేశం ఆదివారం సిద్దిపేటలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో జిల్లా కార్యవర్గసభ్యుడు అందె అశోక్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా చాడ వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సీపీఐ 100 ఏళ్ల ఉద్యమ చరిత్రలో పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించి ఎన్నో విజయాలు సాధించారని గుర్తుచేశారు. వర్గ దోపిడీకి వ్యతిరేకంగా కార్మిక, కర్షక, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ముందుండి పోరాటాలు నిర్వహించేది కమ్యూనిస్టు పార్టీయేనని, దేశంలో మొట్టమొదటగా ప్రజాసంఘాలను ఏర్పాటు చేసింది సీపీఐ మాత్రమే అని అన్నారు. కార్మికుల కోసం ఏఐటీయూసీ, విద్యార్థుల కోసం ఏఐఎస్ఎఫ్, యువజనుల కోసం ఏఐవైఎఫ్, మహిళల కోసం భారత జాతీయ మహిళా సమాఖ్య, రైతుల కోసం అఖిల భారత కిసాన్ సభ, వ్యవసాయ కూలీల కోసం భారత్ మజ్దూర్ యూనియన్, కళాకారుల కోసం ఇప్టాలను ఏర్పాటు చేసిందన్నారు. అన్ని రంగాల సమస్యల పరిష్కారం కోసం నేటికీ పోరాడుతోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, కార్యవర్గసభ్యులు మల్లేశ్, లక్ష్మణ్, శంకర్, వనేశ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జనార్ధన్, మధు, నరేశ్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల పిలుస్తోంది

- ఆరు నుంచి పదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- నేటి నుంచి ఫిబ్రవరి 28 వరకు స్వీకరణ
- ఏప్రిల్ 13న పరీక్ష

బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఇదొక మంచి అవకాశం. ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఎప్పటి నుంచో ఎదురుచూస్తుంటారు. ఇప్పుడు సమయం వచ్చింది. కార్పొరేట్‌కు సమానంగా బోధిస్తూ తనకంటూ ప్రత్యేకతను ఇప్పటికే చాటాయి. అందరి చూపు తమ వైపునకు తిప్పుకున్నాయి. తల్లిదండ్రులు సైతం పిల్లలను చేర్పేందుకు ఇష్టపడుతున్నారు. ఆ మేరకు ప్రవేశ వివరాలతో కథనం..



లచ్చపేట ఆదర్శ పాఠశాల

దుబ్బాకటౌన్: ఆంగ్ల మాధ్యమంలో చదవాలనుకునే విద్యార్థులకు ఆదర్శ పాఠశాలలు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నాయి. బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తున్నాయి. ఆమేరకు విద్యార్థులు చేరేందుకు ఆసక్తిని చూపుతున్నారు. ప్రస్తుతం 2025-26 సంవత్సరానికి గాను 6వ తరగతిలో 100 సీట్లు, 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలి ఉన్న పరిమిత సీట్లకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. సోమవారం నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు telanganams.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరుతున్నారు.

జిల్లాలో 14 పాఠశాలలు

సిద్దిపేట జిల్లాలో 14 ఆదర్శ పాఠశాలున్నాయి. ఒక్కో పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి 100 సీట్లు ఉన్నాయి. మిగిలిన తరగతులకు సంబంధించి ఖాళీలను భర్తీ చేయనున్నారు. జిల్లాలో దుబ్బాక, మిరుదొడ్డి, ఇర్కోడ్, చిన్నకోడూరు, నంగునూరు, కొండపాక, గజ్వేల్, చేర్యాల, మద్దూర్, బెజ్జంకి, హుస్నాబాద్, కోహెడ, దౌల్తాబాద్ మండలాల్లో పాఠశాలలున్నాయి.


ఏప్రిల్ 3 నుంచి హాల్‌టికెట్లు

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 3వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లౌడ్ చేసుకోవచ్చు. ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. 6 తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 13న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. ప్రవేశ పరీక్ష కోసం ఓసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, దివ్యాంగ విద్యార్థులు రూ.125 ఫీజు చెల్లించాలి.

పరీక్ష విధానం

ఆరో తరగతి ప్రవేశ పరీక్షలో 100 ప్రశ్నలకు 100 మార్కులు ఉంటాయి. ప్రశ్న పత్రం తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఉంటుంది. తెలుగు, గణితం, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఆంగ్లం పాఠ్యాంశాల్లో ఒక్కో దాని నుంచి 25 ప్రశ్నలు ఉంటాయి. 7 నుంచి 10వ తరగతి వారికి గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రం, ఇంగ్లిష్ నుంచి 100 ప్రశ్నలు వస్తాయి. ఒక్కో దాని నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. 2 గంటల పాటు ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఒక్కో పాఠశాలలో పరిమిత సీట్లకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. నాణ్యమైన విద్య, చక్కని క్రమ శిక్షణ, మెరుగైన ఫలితాలతో ముందంజలో ఉన్న పాఠశాలలో విద్యార్థులను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు.

– బుచ్చిబాబు ప్రిన్సిపాల్, లచ్చపేట